నెరవేరనున్న కల



అప్పారెడ్డిపల్లి-పర్వతాపురం గ్రామాల మధ్యన పెద్దవాగుపై నిర్మిస్తున్న వంతెన

- ఎట్టకేలకు వంతెన నిర్మాణం ప్రారంభం
- స్వాతంత్య్రం రాకముందు ఉన్నబాటపై రాకపోకలు
- నిర్మాణం పూర్తయితే వనపర్తికి వెళ్లేందుకు సుగమం
- పీఎంజీఎస్‌వై ద్వారా రూ.1.20 కోట్లు మంజూరు

ఖిల్లాఘనపురం: దేశానికి స్వాతంత్య్రం రాక ముందునుంచి ఉన్న దారికి మధ్యలో అడ్డుగా ఉన్న పెద్ద వాగు పలుగ్రామాల ప్రజలను కలుసుకోకుండా దూరం చేసింది. ప్రభుత్వాలు, నాయకులు మారినా ఈ దారికి వాగుపై వంతెన నిర్మాణం చేయడానికి ఎవరు ముందుకు రాలేదు. ఎట్టకేలకు రాష్ట్రం ఏర్పడిన తరువాత పలు గ్రామాల ప్రజల వినతి మేరకు నాటి వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి బ్రిడ్జి నిర్మాణంతో పాటుగా అప్పారెడ్డిపల్లి నుంచి ఆముదంబండ తండా వరకు రోడ్డు వేసేందుకు నిధులు మంజూరు చేయించేందుకు చర్యలు తీసుకున్నారు.

పీఎంజీఎస్‌వై నుంచి రూ.5.90 కోట్లు

మండలంలోని అప్పారెడ్డిపల్లి నుంచి ఆముదంబండ తండావరకు రోడ్డు నిర్మాణంతో పాటుగా అప్పారెడ్డిపల్లి పర్వతాపురం గ్రామాల మధ్యన ఉన్న పెద్ద వాగుపై వంతెన నిర్మించేందుకు రూ.5.90 కోట్ల నిధులను మంజూరు చేశారు. ఇందులో బ్రిడ్జి నిర్మాణానికి రూ.1.20కోట్లను కేటాయించారు. రోడ్డు, బ్రిడ్జి నిర్మించేందుకు ప్రభుత్వం నుంచి టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు వెంటనే పనులు ప్రారంభించకపోవడంతో నిధులు మంజూరైన నిర్లక్ష్యమేనా అంటూ ఊసూరుమన్నారు. ఎట్టకేలకు వంతెన నిర్మాణానికి టెండర్ తీసుకున్న కాంట్రాక్టర్ పనులు ప్రారంభించి వేగంగా నిర్మిస్తున్నారు. దీంతో పలు గ్రామాల ప్రజల సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



పనులకు సంబంధించిన ఏర్పాటు చేసిన బోర్డు

రాకపోకలకు సుగమం



మా ఊరి నుంచి పర్వతాపురం మధ్యలో వాగు ఉండటంతో పోవడానికి వచ్చేది కాదు. వర్షాకాలంలో కనీసం నడుచుకుంటూ పోవడానికి కూడా వచ్చేదికాదు. అత్యవసర సమయాల్లో వెళ్లాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఇప్పుడు బ్రిడ్జి కడుతుండరు చాతా సంతోషంగా ఉంది.

–కొత్తగొల్ల కేశన్న, అప్పారెడ్డిపల్లి

రోడ్డు పనులు ప్రారంభించాలి



బ్రిడ్జి కడుతుండరు కాని రోడ్డు పనులు చేయడం లేదు వెంటనే రోడ్డు పనులు కూడా చేస్తే మా ఊరి మీదుగా నేరుగా వనపర్తికి వెళ్లొచ్చు. పాలమూరుకు, అప్పారెడ్డిపల్లికి వెళ్లాలన్న ఇబ్బందిగా ఉండేది. వాగులో నుంచి ద్విచక్రవాహనాలు వెళ్లడానికి వచ్చేది కాదు. వర్షాకాలంలో ఎప్పుడు నీళ్లు ఉంటాయి. బ్రిడ్జి కడితే నేరుగా అప్పారెడ్డిపల్లి మీదుగా మహబూబ్‌నగర్ వెళ్లొచ్చు.

–బాలకొండయ్య, పర్వతాపురం..

రెండు నెలల్లో నిర్మిస్తాం



అప్పారెడ్డిపల్లి, పర్వతాపురం గ్రామాల మధ్యన పెద్దవాగుపై నిర్మిస్తున్న వంతెన పనులు వేగంగా చేపడుతున్నాం .వర్షాలు ఎక్కువగా రాకుంటే మరో రెండు నెలల్లో వంతెన పనులు పూర్తిచేస్తాం. రోడ్డు పనులు చేసే కాంట్రాక్టర్‌తో కూడా మాట్లాడాం. త్వరలోనే రోడ్డు పనులు ప్రారంభిస్తాం.

–లక్ష్మీనారాయణరెడ్డి, పంచాయతీరాజ్‌శాఖ డీఈ, వనపర్తి

క్లుప్తంగా

సీపీఐ మహాసభలను జయప్రదం చేయాలి



అమరచింత (ఆత్మకూర్): సీపీఐ జిల్లా మూడో మహాసభలు ఈ నెల 23, 24 తేదీల్లో ఆత్మకూర్‌లోని ఎంజీ గార్డెన్‌లో నిర్వహిస్తున్నామని కార్మికులు, కర్షకులు అధికసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని నాయకులు కోరారు. ఆదివారం ఆత్మకూర్‌లో, అమరచింతలో మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. మహాసభకు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి బాలనర్సింహాతో పాటు పలువురు రాష్ట్ర నాయకులు హాజరవుతున్నారన్నారు. కార్యక్రమాల్లో నాయకులు శ్రీహరి, సీఎన్‌శెట్టి, లక్ష్మీనారాయణశెట్టి, కుతూబ్, లింగన్న, రవీందర్, అబ్రహం, శ్యాంసుందర్, ఇబ్రాయిల్, సాలు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలకు విద్యార్థి ఎంపిక



ఆత్మకూర్: సబ్ జూనియర్ సైక్లింగ్ పోటీలకు ఎంవీ రామన్ పాఠశాల విద్యార్థిని సిరి ఎంపికైనట్లు మాజీ ఎంపీపీ డాక్టర్ శ్రీ.దర్‌గౌడ్ ఆదివారం తెలిపారు. తమ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న విద్యార్థిని సిరి నారాయణపేటలో జరిగిన ఐదు కిలోమీటర్ల సబ్‌జూనియర్ సైక్లింగ్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చిందన్నారు. ఖేలో ఇండియా సబ్‌జూనియర్ పోటీలకు ఎంపికై హైదరాబాద్ నాగోల్ జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా సిరిని ఉపాధ్యాయులు, స్థానికులు అభినందించారు.

భగవద్గీత గ్రంథాలపై ప్రచారం

కొత్తకోట రూరల్: పట్టణంలో త్రైత సిద్ధాంత ఆదివారం గ్రంథాలపై ప్రచారం చేశారు. ప్రబోధసేవాసమితి ఇందూ జ్ఞానవేదిక కొత్తకోట, పెబ్బేరు మండలాల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం పట్టణ కేంద్రంలో రాఘవేంద్ర కాలనీలో 100 ఆధ్యాత్మిక త్రైతసిద్ధాంత గ్రంథాలపై ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. శ్రీకృష్ణ భగవానుడికి మాత్రమే ఊరేగింపు చేయాలని దేవుడే అవతరించి ఒక మనిషిగా జన్మిస్తే ఆయనను భగవంతుడు అంటామన్నారు. కార్యక్రమంలో విజయ భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పురుషోత్తం తదితరులు ఉన్నారు.

బైరోజు చంద్రశేఖర్‌కు సన్మానం



వనపర్తిటౌన్: సురవరం ప్రతాప్‌రెడ్డి తెలుగు యూనివర్సిటీ నుంచి శిల్ప కళారంగంలో బైరోజు చంద్రశేఖర్ ప్రతిభా పురస్కారాన్ని అందుకోవడంతో ఆయనను ఆదివారం జిల్లా కేంద్రంలో సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు శంకర్‌గౌడ్ మాట్లాడుతూ.. సాహితీవేత్త, వ్యాఖ్యాతనే కాకుండా శిల్పకళలో చిన్నప్పటి నుంచి నైపుణ్యుడన్నారు. కార్యక్రమంలో కవులు నారాయణరెడ్డి, బిచ్చయ్య, పాన గల్ ఎంఈఓ శ్రీనివాసులు, ఏసీజేఈ గణేష్‌కుమార్, జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు వరప్రసాదరావు, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ సురేందర్‌రెడ్డి, గాయకులు సత్తార్, దేశిరాములు, నాగరాజు, బండారు శ్రీనివాస్, ఉపాధ్యాయులు దర్శన్‌కుమార్, డా.నరేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హక్కులకోసం పోరాటానికి సిద్ధంకండి



అమరచింత(ఆత్మకూర్): బీడీ కార్మికుల హక్కుల సాధనకోసం పోరాటాలకు సిద్ధమవ్వాలని టీయూసీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దేవాదీనం అన్నారు. ఆదివారం పట్టణంలో మార్క్స్ భవనంలో బీడీ కార్మికులతో సమావేశమయ్యారు. ఈ నెల 31న చలో కలెక్టరేట్ పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లాకార్యదర్శి అరుణ్‌కుమార్, నాయకులు సామేలు, రాజు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై ఉద్యమాలకు సిద్ధం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం సీనియర్ నాయకులు

వనపర్తి రూరల్: రానున్న రోజుల్లో ప్రజాసమస్యలపై ఉద్యమించాలని సీపీఎం సీనియర్ నాయకుడు సోమయ్య పిలుపునిచ్చారు. జిల్లాకేంద్రంలోని దాచ లక్ష్మయ్య ఫంక్షన్‌హాల్లో ఆదివారం జిల్లా పార్టీ కార్యదర్శివర్గ సభ్యుడు బాల్‌రెడ్డి అధ్యక్షతన జిల్లా నాయకత్వపు అవగాహన శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సమావేశానికి పార్టీ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులుతో పాటు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కమ్యూనిస్టుల పూర్తి స్వాతంత్య్రాన్ని డిమాండ్ చేస్తూనే, భూస్వామ్య రద్దు, అధిపత్యాన్ని అంతంచేయడం, కుల అణచివేతకు వ్యతిరేకంగా పోరాడారన్నారు. బ్రిటీష్ పాలకులు భారతదేశంలో కమ్యూనిజాన్ని తుడిచిపెట్టాలని, కమ్యూనిస్ట్ ఉద్యమ నాయకత్వంపై వరుస కుట్ర కేసులు నమోదు చేశారన్నారు. వామపక్ష నేతృత్వంలోని ప్రభుత్వాలు ప్రజానుకూల విధానాలకు అమలు చేయడానికి కృషి చేయడం ద్వారా మార్గాన్ని చూపించామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండీ జబ్బార్, జీఎస్ గోపి, మండ్ల రాజు, పరమేశ్వరచారి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు యువకుల చేయూత



వీపనగండ్ల: మండలంలోని పుల్గర్‌చర్ల గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన బోయగంగరాముని అంత్యక్రియలకు ఆదివారం గ్రామంలోని యువకులందరు కలిసి రూ.23,500 ఆర్థికసాయాన్ని అందజేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన మృతుడి కుటుంబ సభ్యులకు అంత్యక్రియలు నిర్వహించేందుకు కూడా స్థోమత లేదు. దీంతో ఈ విషయాన్ని గమనించి గ్రామ యువకులు పలువురి దాతలను ఆశ్రయించి ఆర్థికసాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ప్రభుత్వ పరంగా కుటుంబాన్ని ఆదుకోవాలని వారు అధికారులకు విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టొద్దు



ఆరోగ్య ఉపకేంద్రం శిలాఫలకం ప్రాంతంలో నిర్మిస్తున్న ఇల్లు

ఖిల్లాఘనపురం: మండలకేంద్రం కుమ్మరిగేరి సమీపంలో ఆరోగ్య ఉపకేంద్రం కోసం ఇచ్చిన స్థలంలో చేపడుతున్న ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ పంచాయతీ కార్యదర్శికి ఆదివారం ఫిర్యాదు చేశారు. ఈ స్థలంలో 2023 ఆగస్టు 22న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆరోగ్య ఉపకేంద్రం కోసం శిలాఫలకం ఏర్పాటు చేశారు. తరువాత ఏం జరిగిందో తెలియదు గాని నిర్మించలేదు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇటీవల ఇందిరమ్మ ఇల్లును నిర్మిస్తున్నాడు. విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన పాలవాది రాజు గ్రామస్తులతో కలిసి అభ్యంతరం వ్యక్తం చేస్తూ కార్యదర్శి రవితేజకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో బస్తీ దవాఖాన కోసం నాటి సర్పంచ్ క్యామ వెంకటరమణ వివరణ కోరితే తాము దాన పూర్వకంగా ఇచ్చామన్నారు. అలాకాకుండా ఎవరో వచ్చి సొంతంగా ఇంటి నిర్మాణాన్ని చేపట్టడం ఏమిటని ప్రశ్నించారు. ఏ ఆధారం లేకుండా స్థలంలో ఉన్న శిలాఫలకాన్ని తొలిగించి ఇంటి నిర్మాణానికి ఎలా అనుమతులు ఇచ్చారన్నారు. ఫిర్యాదు రావడంతో పనులు ఆపాలని కార్యదర్శి తెలిపారు. అనుమతులు ఇవ్వలేదని, గ్రామస్తుల సమక్షంలో పంచనామ నిర్వహించి స్థలంపై నిర్ణయం తీసుకుంటామని కార్యదర్శి చెప్పారు.

హజ్ యాత్రికులకు సన్మానం



వనపర్తి రూరల్: పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం పెబ్బేరు పట్టణంలోని జామే మసీద్ ఇమామ్ ఎండీ ఇబ్రహీం సాహెబ్, ఎండీ సోహెల్ హజ్ యాత్రకు వెళ్తున్న సందర్భంగా వారిని మార్కెట్ వైస్ చైర్మన్ విజయవర్ధన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు వెంకట్రాములుయాదవ్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాములుయాదవ్, దయాకర్‌రెడ్డి, సర్వేశ్, వెంకటరమణ, షకీల్, బాషా, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే ప్రమాదమే..!

- గుంతలకు మరమ్మతు చేపట్టండి
- ఇబ్బందుల్లో వాహనదారులు

పాన్‌గల్: మండలంలోని మాందాపూర్–దొండాయిపల్లి గ్రామాల మధ్య ఉన్న బీటీ రోడ్డుపై ఏర్పడిన గుంతలతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. శనివారం రాత్రి కురిసిన వర్షానికి రోడ్డుపై ఉన్న గుంతలలో వర్షపు నీరు నిల్వతో గుంతలు ఉన్న విషయం తెలియక వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారు. దీంతో పాటు రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్ల పొదలు రోడ్డును కమ్మివేయడంతో దగ్గరికి వచ్చే వరకు వాహనాలు వస్తున్న విషయం తెలియక ప్రమాదాలవుతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేసి ప్రమాదాలు కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మాందాపూర్-దొండాయిపల్లి గ్రామాల మధ్య గుంతలో వర్షపునీరు

ట్రాన్స్‌ఫార్మర్‌పై తీగలను తొలగించండి

వీపనగండ్ల: మండలంలోని తూముకుంట గ్రామ ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పలురకాల చెట్లు కప్పి వేయడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడమే కాకుండా విద్యుదాఘాతానికి గురయ్యే ప్రమాదం నెలకొందని, విద్యుత్ అధికారులు స్పందించి వెంటనే చెట్ల కొమ్మలను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు. తీగజాతి చెట్లు పూర్తిస్థాయిలో ట్రాన్స్‌ఫార్మర్‌ను కప్పివేసిన విషయాన్ని గ్రామంలోని విద్యుత్ అధికారులకు ఎన్నోమార్లు విన్నవించినా స్పందించడం లేదని ఉన్నతస్థాయి అధికారులు స్పందించి చెట్లను తొలగించాలని వారు కోరుతున్నారు.



రైతులకు సాగునీరు అందించాలి

గోపాల్‌పేట: రేవల్లి మండలంలోని తల్పునూరు, కేశంపేట తండాలకు చెందిన రైతులకు సాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే సాగునీరందించేందుకు అధికారపార్టీ నాయకులు కృషి చేయాలని సేవాలాల్ సేన జిల్లా కన్వీనర్ తిరుపతినాయక్ డిమాండ్ చేశాడు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఉన్నతస్థానాల్లో ఉన్న నాయకులు హామీలు ఇచ్చి మర్చిపోయారని, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో ఉన్న నాయకులు కూడా అలా చేయకుండా ఇచ్చిన హామీ మేరకు కేశంపేట, తల్పునూరు గిరిజన తండాలకు సాగనీరందించాల ని కోరారు. డీ–8 ప్రధాన కాల్వనుంచి కేవలం 2 కిలోమీటర్లు కాల్వ ఏర్పాటు చేస్తే నాలుగైదు వందల ఎకరాలకు సాగునీరందుతుందన్నా రు. ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే ఈ కాల్వ నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు.

ప్రహరీ నిర్మాణం జరిగేనా?

కొత్తకోట రూరల్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అసంపూర్తిగా ఉన్న ప్రహరీ నిర్మాణం పూర్తయ్యే పరిస్థితులు ప్రస్తుతం కనిపించడం లేదని స్థానికులు, కళాశాల విద్యార్థులు, లెక్చరర్స్ వాపోతున్నారు. పట్టణ సమీపంలోని వీవర్స్ కాలనీలో 4 ఎకరాల విస్తీర్ణంలో 21 ఏళ్ల క్రితం భవనాన్ని నిర్మించగా అందులో ప్రభుత్వ జూనియర్ కళాశాల కొనసాగుతుంది. అప్పట్లో నిధుల కొరత కారణంగా కళాశాల చుట్టూ ప్రహరీ నిర్మాణం చేట్టలేకపోయారు. దీంతో కళాశాలకు భద్రత లేకుండా పోయింది. గోడ లేకపోవడంతో గతంలో ఆకతాయిలు కళాశాలలోనే మద్యం తాగి తరగతి గదుల తలుపులను బద్దలు కొట్టిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. అంతే కాకుండా కళాశాల సెలవురోజుల్లో పశువులు, మైదానంలోకి వచ్చి వనమహోత్సవంలో నాటిన మొక్కలను సైతం మేస్తున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో ఏర్పాటు చేసిన కళాశాల భవనానికి స్వరాష్ట్రంలోనూ గతంలో 9 ఏళ్లు పాలించిన పాలకులు పట్టించుకోకపోవడంతో పలు విమర్శలు వెల్లువెత్తాయి. గతంలో నిర్లక్ష్యానికి గురైన కళాశాల కంపౌండ్ వాల్‌ను ప్రస్తుత పాలకులు ప్రత్యేక దృష్టి సారించి గోడ నిర్మాణం చేపట్టాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.



కంపౌండ్ వాల్ లేని ప్రభుత్వ జూనియర్ కళాశాల

భీమా కాల్వలో జమ్ము తొలగించరూ..



బుసిరెడ్డిపల్లి-కేతేపల్లి గ్రామాల మధ్య పేరుకపోయిన జమ్ము

బీపాన్‌గల్: మండలంలోని బుసిరెడ్డిపల్లి, రాయినిపల్లి, కేతేపల్లి గ్రామాల మధ్య ప్రవహిస్తున్న భీమా కాల్వలో పేరుకపోయిన జమ్ము, పిచ్చిమొక్కలు, మట్టిని తొలగించాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు. కాల్వల ద్వారా సాగునీరు విడుదల కావడంతో పేరుకపోయిన జమ్ము, ఇతర పిచ్చిమొక్కలు, మట్టి ఉండటంతో సాగునీరు ముందుకు సక్రమంగా పోకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాగునీటి విడుదలకు ముందే కాల్వలను మరమ్మతులు చేయక ఖరీఫ్ సాగుకు సాగునీరు సక్రమంగా అందుతుందా లేదా అని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించకపోవడంతో కాల్వలో మోటర్లు ఉన్న రైతులు ఒక్కొక్క మోటరుకు రూ.1000 చొప్పున వసూలు చేస్తూ వాటి ద్వారా కాల్వలో పేరుకపోయిన జమ్మును తొలగించుకుంటామని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాల్వలో జమ్మును తొలగించి సాగునీరు సాఫీగా ముందు గ్రామాల రైతులకు చేరేందుకు తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

దివ్యాంగుడికి వీల్‌చైర్ వితరణ



కొత్తకోట రూరల్: మండలంలోని నిర్వేన్ గ్రామంలో దివ్యాంగుడికి వీల్‌చైర్, 40 మంది వృద్ధులకు వాకింగ్ స్టిక్స్, స్టాండ్స్ ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో పానకంటి రవి, రామకృష్ణ, ఎం.భాస్కర్, వెంకటేష్, పెద్దిరవి, సాయి, బుచ్చన్న, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

వచ్చేనెల 3న సీఎం రేవంత్‌రెడ్డి రాక

అడ్డాకుల: మూసాపేట మండలం వేముల శివారులో ఉన్న ఎస్‌జీడీ ఫార్మా కంపెనీ రెండో యూనిట్ ప్రారంభోత్సవానికి వచ్చేనెల 3న సీఎం రేవంత్‌రెడ్డి రానున్నారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, ఎస్‌జీడీ ఫార్మా జనరల్ మేనేజర్ దీపక్‌సూద్ శనివారం రాత్రి సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కంపెనీ ప్రారంభోత్సవానికి రావాలని ఆహ్వానించారు. ఇందుకు సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే జీఎంఆర్ తెలిపారు. ఇదిలా ఉండగా సీఎం రానున్న నేపథ్యంలో కంపెనీ కొత్త యూనిట్ వద్ద పనులను యాజమాన్యం వేగవంతం చేసింది. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు శెట్టిశేఖర్, కంపెనీ ప్రతినిధులు ఉన్నారు.

యథేచ్ఛగా కలప అక్రమ రవాణా

- పట్టించుకోని అధికారులు
- తమకు సంబంధం లేదన్న పోలీస్‌శాఖ

చిన్నంబావి: అడవుల రక్షణకు ప్రభుత్వాలు పని చేస్తుంటే.. అక్రమార్కులు మాత్రం ధనార్జనే ధ్యేయంగా కలప తరలిస్తున్నారు. ఓ వైపు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా హరితహారం, వనమహోత్సవం కార్యక్రమాలను చేపడుతుంటే మరోవైపు అక్రమార్కులు యథేచ్ఛగా చెట్లను నరుకుతూ కలపను అక్రమంగా రవాణా చేస్తున్నారు. మొక్కలు పెంచి పర్యావరణాన్ని పరిరక్షించాలనే నినాదం అధికారుల అలసత్వంతో కాగితాలకే పరిమితమైంది. వాతావరణ సమతుల్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం వాల్టా చట్టం రూపొందించింది. చెట్లను తొలగించాలంటే అటవీ, రెవెన్యూశాఖ, సంబంధిత గ్రామ పంచాయతీ నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి. అధికారుల అలసత్వం, దళారులకు వరంగా మారింది.

అధికారుల పేరుతో కలప రవాణా

మండలంలోని అమ్మాయిపల్లి గ్రామంలో గ్రామానికి చెందిన ఒక దళారి విచ్చలవిడిగా చెట్లను, భారీ వృక్షాలను నరికి ట్రాక్టర్‌పై తరలిస్తుండగా కొంత మంది స్థానికులు అడ్డుకున్నారు. దీంతో పోలీస్ అధికారులు సమాచారం అందిస్తే తమకు సంబంధం లేదని చెప్పడం కొసమెరుపు. పట్టపగలే నడిరోడ్డుపై భారీస్థాయిలో కలపను తరలిస్తుంటే కనీసం వాహనానికి అనుమతులను పరిశీలించాల్సిన అధికారులు చేతులెత్తయేడం చూస్తే పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ఆ అనుమానాలకు ఊట్టిపడేలా దళారి తనకు అందరి అధికారులు చెప్పారని చెప్పడం కొసమెరుపు. ఇప్పటికైనా మండలంలో చెట్లను నరికివేయడాన్ని ఆపివేస్తే బాగుటుందని పలువురు కోరుతున్నారు.



అమ్మాయిపల్లిలో అక్రమ కలపను తరలిస్తుంటే అడ్డుకుంటున్న స్థానికులు (ఫైల్)

మలుపులు ప్రమాదకరం



అంజనగిరి సమీపంలో ప్రమాదకర మలుపు



దావాజిపల్లి స్టేజీ వద్ద..

- సూచికబోర్డులు ఏర్పాటు చేయండి

పాన్‌గల్: వనపర్తి–కొల్లాపూర్ వయా పాన్‌గల్ మీదుగా ఉన్న ఆర్అండ్‌బీ ప్రధాన రోడ్డు పలు గ్రామాల దగ్గర ప్రమాదకర మలుపులు ఉండటంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు దగ్గరికి వచ్చే వరకు కన్పించకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఆయా మలుపులు ఉన్నట్లు సంబంధిత అధికారులు ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం కూడా ప్రమాదాలకు కారణమవుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. వనపర్తి నుంచి పాన్‌గల్ వరకు ఉన్న రోడ్డుపై అనేక మలుపులు ఉన్నాయి. అంజనగిరి దగ్గర, దావాజిపల్లి స్టేజీ సమీపంలో, అన్నారంతండా, అన్నారం, గోప్లాపూర్, కొత్తపేట స్టేజీ సమీపంలో, పాన్‌గల్ ఈద్గా సమీపంలో మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆయా మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు రోడ్డుకు ఇరువైపులా రోడ్డును కమ్మివేసిన చెట్ల కొమ్మలను తొలగించి ప్రమాదాలు చోటు చేసుకోకుండా తగు చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.



అన్నారం తండాలో..